## కాంగ్రెస్‌ను నమ్మితే అధోగతే

సొంత డిక్లరేషన్‌పైనే నిలబడనంత గొప్ప పార్టీ అని కాంగ్రెస్‌ను ఎద్దేవా చేసిన మంత్రి కేటీఆర్.. గ్యారెంటీ లేని కాంగ్రెస్ బిల్డప్ గాళ్లు నేడు గ్యారెంటీల పేరిట వస్తున్నారని, జాగ్రత్త అని హెచ్చరించారు. రాహుల్‌గాంధీకి ఎవుసం అంటే తెలియదని, క్లబ్బులు, పబ్బులు, చిందులు, విందులు మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం కుటుంబంలో ఒకరికే టికెట్ అన్నారని కానీ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి, మైనపల్లి వెంకటస్వామి కుటుంబాలకు రెండేసి టికెట్లు ఇచ్చారని విమర్శించారు. రాహుల్‌కు ఈ దేశం పప్పు అనే బిరుదు ఇచ్చిందని, అలాంటి పప్పు కోల్‌కతాలో మమతను, ఢిల్లీలో కేజ్రీవాల్‌ను, ఇక్కడికొచ్చి మనల్ని బీజేపీకి బీటీం అని విమర్శిస్తారని గుర్తు చేశారు. నిజానికి కాంగ్రెస్ పార్టీనే బీజేపీకి బీటీం అని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టాలని కోరారు.

> రాహుల్‌గాంధీకి ఈ దేశమే పప్పు అన్న బిరుదు ఇచ్చింది. ఆ పప్పు కోల్‌కతా వెళ్లి మమతా బెనర్జీని, ఢిల్లీ వెళ్లి కేజ్రీవాల్‌ను, తెలంగాణ వచ్చి బీఆర్‌ఎస్‌ను బీ టీం అని విమర్శిస్తారు. నిజానికి కాంగ్రెస్సే బీజేపీకి బీ టీం.
>
> బీఆర్‌ఎస్ ప్రభుత్వం 36 ఫ్లైఓవర్లు కడితే.. ఉప్పల్ ఫ్లైఓవర్ కట్టడం ఒక్కటి కట్టడం చేతకాని బీజేపీ సిగ్గులేకుండా ఓట్లు అడిగేందుకు వస్తున్నది. జాతీయ రహదారి పేరుతో ఉప్పల్ ఫ్లైఓవర్‌ను బలవంతంగా తీసుకొచ్చి మనపై రుద్ది చావగొడుతున్నారు.
>
> కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కరెంటు ఉంటే కాంగ్రెస్ ఉండదు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే గ్యారెంటీలన్నీ అటకెక్కేశాయి. అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తామని భట్టి విక్రమార్క అంటున్నారు. మనకు మళ్లీ పట్వారీ వ్యవస్థ కావాలా?
>
> -మంత్రి కేటీఆర్



గురువారం మల్కాజిగిరి నియోజకవర్గం ఆనంద్‌బాగ్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు. చిత్రంలో అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

# కాంగ్రెస్ ఉన్నచోట కరెంటు ఉండదు

## ఆ పార్టీకి కరెంటుకు అస్సలు పడదు

సొంత డిక్లరేషన్‌నే పైనే నిలబడని పార్టీ అది

రాహుల్‌గాంధీకి అందుకే పప్పు బిరుదు

- కాంగ్రెస్, బీజేపీ నాయకులు దేశముదుర్లు
- వచ్చే టర్మ్‌లో మూడు అంశాలకు ప్రాధాన్యం
- ఫ్లడ్ మేనేజ్‌మెంట్ కోసం రూ.20 వేల కోట్లు
- ఉప్పల్ ఫ్లై ఓవర్ కట్టలేక బీజేపీ ఆపసోపాలు
- కారుగుర్తుకు ఓటేసి అభివృద్ధికి సహకరించండి
- రోడ్‌షోలలో మంత్రి కేటీఆర్
- జోరువానలోనూ పోటెత్తిన ప్రజలు

హైదరాబాద్ సిటీబ్యూరో/నల్లగొండ ప్రతినిధి/సూర్యాపేట/ మహబూబ్‌నగర్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): కరెంటుకు కాంగ్రెస్‌కు అస్సలు పడదని, కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కరెంటు ఉంటే కాంగ్రెస్ ఉండదని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయ్యాక కొత్త పథకాలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈసారి కేసీఆర్ గెలిస్తే ఢిల్లీకి వచ్చి గులాబీ జెండా పాతుతాడనే అక్కడి పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, కేసీఆర్ గొంతునొక్కి, బీఆర్‌ఎస్‌ను ఇక్కడే ఖతం చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వంటివాళ్లు తెలంగాణకు క్యూకడుతున్నారని విమర్శించారు. ఎంత మంది వచ్చినా, ఎవరొచ్చినా భయపడేది లేదని, బీఆర్‌ఎస్ ప్రజలను నమ్ముకుందని పేర్కొన్నారు. గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండ, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, నారాయణపేట జిల్లా మక్తల్, హైదరాబాద్‌లోని ఉప్పల మల్కాజిగిరి రోడ్‌షోలలో పాల్గొన్నారు. దేవరకొండలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్, హుజూర్‌నగర్‌లో శానంపూడి సైదిరెడ్డి, మక్తల్‌లో చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఉప్పల్, మల్కాజిగిరిలో బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డికి మద్దతుగా వర్షంలోనూ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో కరెంటు లేక, సాగునీరు రాక, తాగునీరు దొరక్క, ఫ్లోరోసిస్‌తో పడ్డ ఇబ్బందులు చాలవా? అని ప్రశ్నించారు. ఢిల్లీ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నేతలు దేశముదుర్లని, కట్టుకథలు చెప్పి ఓట్లు వేయించుకుని బయటపడతారని హెచ్చరించారు. రవీంద్రకుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే దేవరకొండ అభివృద్ధి బాధ్యత తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు.

### ఈసారి మూడు అంశాలకు ప్రాధాన్యం

హైదరాబాద్‌లో నిరంతర విద్యుత్, మెరుగైన నీటి సరఫరా, రహదారులు, బస్తీ దవాఖానాలు, 20కేఎల్ ఉచిత వాటర్ సహా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఈసారి అధికారంలోకి వస్తే మూడు అంశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. కరోనా కారణంగా మూసీ సుందరీకరణలో జాప్యం జరిగిందని, 14 బ్రిడ్జీలతో పాటు గోదావరి నీటితో జీవనదిగా మార్చి అద్భుతమైన పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. మెట్రోను 415 కిలోమీటర్ల మేర విస్తరిస్తామని తెలిపారు. ఫ్లడ్ మేనేజ్‌మెంట్ సిస్టం కోసం 20 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. ఉప్పల్ ఫ్లై ఓవర్ ఒక్కటి కట్టడం చేతకాక బీజేపీ సిగ్గులేకుండా ఓట్లు అడిగేందుకు వస్తున్నదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 36 ఫ్లైఓవర్లు కడితే.. జాతీయ రహదారి పేరిట ఉప్పల్ ఫ్లైఓవర్‌ను బలవంతంగా తీసుకొచ్చి మనల్ని చావగొడుతున్నారని మండిపడ్డారు. రోడ్‌షోలలో దేవరకొండ ఎన్నికల ఇన్‌చార్జి అమిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు బిల్యానాయక్, కిషన్‌లాల్, వడ్త్యా రమేశ్, జగన్‌లాల్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా నాయకురాలు సుచరిత, బీఆర్‌ఎస్ పార్టీ మక్తల్ ఇన్‌చార్జి ఆంజనేయగౌడ్, ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, తాడూరి శ్రీనివాస్, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, సోమశేఖర్, పావని, నందికంటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు. హాజరైన ప్రజలు

## గాడిదకు గడ్డేస్తే ఆవుకు పాలొస్తయా!

ప్రజల నోట్లో మన్నుకొట్టేందుకు కాంగ్రెస్ నేతలు మళ్లీ వస్తున్నారని, ఆ పార్టీకి ఓటేస్తే చీకటి రాజ్యం ఖాయమని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. గాడిదకు గడ్డివేసి ఆవుకు పాలు పిండితే వస్తాయా? అలానే, కాంగ్రెస్‌కు ఓటేస్తే పనులు అవుతాయా? అని ప్రశ్నించారు. రేవంత్ చెప్పినట్టు వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలా? అని ప్రశ్నించారు. 24 గంటల కరెంటు ఎక్కడ వస్తుందని ప్రశ్నించే రేవంత్‌కు దమ్ముంటే కరెంటు వైర్లు పట్టుకోవాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ హయాంలో పోలీస్ స్టేషన్లలో క్యూలో ఎరువులు అమ్మారని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని నిలదీశారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే గ్యారెంటీలన్నీ అటకెక్కేశాయని ఎద్దేవా చేశారు. ధరణి తీసేసి పట్వారీ వ్యవస్థ తీసుకొస్తామని భట్టి విక్రమార్క అంటున్నారని, మళ్లీ మనకు పట్వారీ వ్యవస్థ కావాలా? అని ప్రశ్నించారు. మంచి పనులు చేసిన ప్రభుత్వం, మంచినీళ్లు, సాగునీరు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా ఇచ్చిన ప్రభుత్వం, గ్రామాల్లో బ్రహ్మాండంగా మంచి పనులు చేసిన ప్రభుత్వం మనదేనని చెప్పారు. కారు గుర్తుకు ఓటేసి మళ్లీ అభివృద్ధికి సహకరించాలని, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

## కర్ణాటకలో గ్యాసే..

**టీఎస్‌పీహెచ్‌సీ చైర్మన్ కోలేటి**



హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలన్నీ ఉత్త గ్యాస్ అని తేలిపోయాయని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ ఒక ప్రకటనలో విమర్శించారు. అక్కడ అమలు సాధ్యం కాని హామీలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజలు ఐదు గ్యారెంటీలు అమలుగాక మోసపోయామని నేడు గ్రహించారని తెలిపారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజానీకం కుదుటపడగానే కాంగ్రెస్ నేతలు హామీల పేరుతో గారడీలు చేసేందుకు వస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కొనసాగింపు కోసం మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీకే ఓటేయాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ వస్తే వర్గీకరణ దూరమైనట్టే

- వంగపల్లి శ్రీనివాస్



ముషీరాబాద్, నవంబర్ 23: ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే వర్గీకరణ దూరమవుతుందని టీఎస్‌ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మాదిగ బిడ్డలను పొట్టనపెట్టుకున్న కాంగ్రెస్‌కు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని, వర్గీకరణకు కట్టుబడి ఉన్న పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గురువారం విద్యానగర్‌లోని టీఎస్‌ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో మరోమారు వర్గీకరణ అంటున్న కాంగ్రెస్ మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. మాదిగల వర్గీకరణ అంశాన్ని కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా వాడుకుంటూ మోసం చేస్తూ వస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎంపీలు ఏనాడు వర్గీకరణ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తలేదని, ఆ పార్టీ అగ్రనేత రాహుల్, రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌కు వర్గీకరణ గురించి మాట్లాడే అర్హత లేదని చెప్పారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే రియల్ ఢమాల్

## అధఃపాతాళానికి భూముల ధరలు

- బెంగళూరులో అదే జరిగింది
- అక్కడ 28 శాతం పడిపోయింది
- ఆ పార్టీకి ఓటు.. ప్రజలకు చీకట్లు
- స్థిరమైన పాలనతోనే అభివృద్ధి
- మాది 4ఎస్ అభివృద్ధి మాడల్
- కేంద్రంలో అరాచక ప్రభుత్వం
- అయినా రాష్ట్రం సమగ్రాభివృద్ధి
- మంత్రి కే తారకరామారావు వెల్లడి




గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ సాధించిన ప్రగతి గురించి వివరిస్తున్న మంత్రి కే తారకరామారావు

| | 2014 | 2023 |
|---|---|---|
| తలసరి ఆదాయం | 1,24,104 | 3,17,115 |
| జీఎస్‌డీపీ | 5.05 లక్షలకోట్లు | 13.27 లక్షలకోట్లు |
| పేదరికం | 13.18 శాతం | 5.8 శాతం |
| పంట విస్తీర్ణం | 131 లక్షల ఎకరాలు | 268 లక్షల ఎకరాలు |
| ధాన్యం దిగుబడి | 68 లక్షల టన్నులు | 3.5 కోట్ల టన్నులు |
| విద్యుత్తు ఉత్పత్తి | 7700 మెగావాట్లు | 18,567 మెగావాట్లు |
| ఐటీ ఎగుమతులు | రూ.57,000కోట్లు | రూ.2.41లక్షల కోట్లు |

### ఉద్యోగాల కల్పనలో తెలంగాణ సర్కారు

| అనుమతించిన ప్రభుత్వ ఉద్యోగాలు | నోటిఫై చేసిన ఉద్యోగాలు | నియామక ప్రక్రియ పూర్తయినవి |
|---|---|---|
| 2,32,308 | 2,02,735 | 1,60,083 |
| **భర్తీ ప్రక్రియలో ఉన్నవి** | **ప్రైవేట్ రంగంలో** | **ఐటీ రంగంలో** |
| 42,652 | 24 లక్షలు | 6 లక్షల పైచిలుకు |

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణలో రియల్ ఎస్టేట్ ఢమాల్ అవటం ఖాయమని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఆ పార్టీకి స్థిరమైన పాలన చేతకాదని, ప్రతి ఆరునెలలకు ఓ సీఎంను మార్చుతుందని వెల్లడించారు. దాంతో పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోలేక రాష్ట్రంలో పరిస్థితులు అస్తవ్యస్తం అవుతాయని, అందుకు కర్ణాటకే ఉదాహరణ అని వివరించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు, నేడు ఆయా రంగాల్లో సాధించిన ప్రగతిపై గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బెంగళూరులో రియల్ ఎస్టేట్ రంగం 28% పడిపోయినట్టు నివేదికలు చెప్తున్నాయని అన్నారు.

### కాంగ్రెస్‌తో ప్రజలకు పవర్ ఉండదు

కాంగ్రెస్‌కు పవర్ ఉంటే ప్రజలకు పవర్ ఉండదని, కర్ణాటకే అందుకు ఉదాహరణ అని కేటీఆర్ అన్నారు. అందుకే తాము కరెంట్ కావాలో, కాంగ్రెస్ కావాలో తేల్చుకోవాలని ప్రజలను కోరుతున్నామని చెప్పారు. 50 ఏండ్లలో కాంగ్రెస్ 7,700 మెగావాట్ల ఇన్‌స్టాల్ కెపాసిటీ విద్యుత్తు మాత్రమే ఏర్పాటు చేస్తే, తాము ఆరున్నరేండ్లలోనే 18,567 మెగావాట్లకు పెంచటమే కాకుండా, వచ్చే ఏడాది చివరికల్లా దామరచర్ల పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 24 వేల మెగావాట్లకు పెరుగుతుందని వివరించారు. సౌర విద్యుత్తు ఉత్పత్తిలోనూ రెండో అతిపెద్ద రాష్ట్రం అని తెలిపారు.

### రాష్ట్రంలో 4-ఎస్ అభివృద్ధి

తమది సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య అభివృద్ధి మాడల్ అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఒక్క రంగం అని కాకుండా, అన్ని రంగాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని తెలిపారు. ఈ విషయంలో చెన్నైలో ఉండే రజనీకాంత్‌కు అర్థమైనా, ఇక్కడుండే గజినీలకు అర్థం కావటం లేదని విమర్శించారు. వైద్యరంగం విషయానికొస్తే, ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజ్, ఒక నర్సింగ్ కాలేజ్‌తోపాటు మల్టీ స్పెషాలిటీ దవాఖానలను ఏర్పాటు చేశామని వివరించారు. 'రైతు ఆత్మహత్యలను గణనీయంగా తగ్గించాం. సాక్షాత్తు పార్లమెంటే ఈ విషయాన్ని ప్రకటించింది. నెలకు విద్యుత్తుపై వెయ్యి కోట్లు ఖర్చు పెడుతున్నాం' అని తెలిపారు. రాష్ట్రంలో ఐదు విప్లవాలు సాకారమయ్యాయని స్పష్టం చేశారు. ఇక, కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయాలు చేటం మంచిది కాదని ప్రతిపక్షాలకు హితవు చెప్పారు. రాజకీయాలు ఎప్పుడైనా చేసుకోవచ్చని, స్వార్థ ప్రయోజనాల కోసం ప్రాజెక్టును బద్నాం చేయవద్దని కోరారు.

### ఫ్లోరోసిస్‌ను పారదోలిన ఘనత కేసీఆర్‌దే

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైనప్పుడు ఫ్లోరోసిస్ లేదని, ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలకు మంచినీటిని సమకూర్చలేకపోవడంవల్లే ఇది పెరిగిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. 'ఓ సందర్భంలో యూఎన్‌ఓ సైతం నల్లగొండ జిల్లా మానవ రహిత జోన్‌గా మారుతుందని చెప్పింది. అటువంటి నల్లగొండకు నేడు శాశ్వతంగా ఫ్లోరోసిస్ నుంచి విముక్తి కలిగించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ద్వారా గ్రామ స్వరాజ్యం, పట్టణాల అభివృద్ధిని సాధించాం. హరితహారం ద్వారా 7.7 శాతం గ్రీన్‌కవర్ పెరిగింది. ఎక్కడా లేనివిధంగా బీడీ కార్మికులకు కూడా పెన్షన్లు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. కల్యాణలక్ష్మి, దళితబంధు మా మ్యానిఫెస్టోలో పెట్టకుండానే ప్రవేశపెట్టాం' అని వివరించారు. సంక్షేమంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నదని తేల్చిచెప్పారు. విద్యలోనూ అగ్రగామిగా నిలిచామని, 'పలకతో రండి పట్టాతో పోండి' అన్న నినాదంతోనే కేజీ టు పీజీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇందులో భాగంగానే వెయ్యి గురుకులాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

### ధరణితో రాబందులకు చెక్ పెట్టాం

గతంలో చేయి తడపందే రిజిస్ట్రేషన్లు అయ్యేవి కాదని, ధరణి ద్వారా నేడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తక్షణమే రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇందులో కొన్ని లోటుపాట్లు ఉండొచ్చని, వాటిని సరిచేసుకునే వీలుందని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ భూమేత పేరుతో ఏదో చేస్తామంటున్నదని, తిరిగి పట్వారీ వ్యవస్థను తెస్తామని చెప్తున్నదని, ఇది దళారీ వ్యవస్థ తప్ప మరొకటి కాదని ఎద్దేవా చేశారు.

### మతాల మంటలు లేకుండా పాలన

యాదగిరిగుట్ట వంటి ఆలయాలు నిర్మించిన ఏకైక సీఎం కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ చెప్పారు. మతంపేరుతో మంటలు పెట్టకుండా, మతాన్ని రాజకీయాలకు వాడకుండా రూ.1,200 కోట్లతో ఇంతపెద్ద ఆలయాన్ని పునర్నిర్మించామని అన్నారు. 500 కోట్లతో కొండగట్టు అంజన్న ఆలయం, 700 కోట్లతో వేములవాడ రాజన్న ఆలయం, 100 కోట్లతో ధర్మపురి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. మహిళల భద్రతకు భరోసా కల్పించడంతోపాటు శాంతిభద్రతలను గాడిలో పెట్టామని చెప్పారు. తెలంగాణలో అన్ని మతాలవారు సురక్షితంగా, సుఖశాంతులతో జీవిస్తున్నారని పేర్కొన్నారు.

### ఉద్యోగాలపై మోదీ, రాహుల్‌కు సవాల్

ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో తెలంగాణ కన్నా మెరుగైన ప్రదర్శన చేసిన రాష్ట్రం ఏదైనా ఉంటే చూపాలని ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి కేటీఆర్ సవాల్ విసిరారు. 'గత తొమ్మిదేండ్లలో 1,60,083ఉద్యోగాలు భర్తీ చేశాం. మరో 43,652 ఉద్యోగాల భర్తీ ప్రాసెస్‌లో ఉన్నది. దేశంలో కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలు ఏవైనా మాకన్నా మెరుగ్గా ఉద్యోగాల భర్తీ చేశాయా? గుజరాత్, రాజస్థాన్ వంటి పెద్ద రాష్ట్రాల్లోనూ 1.6లక్షల ఉద్యోగాల భర్తీ కాలేదు. ఇక, రాష్ట్రానికి మా పాలనలో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 24,000 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశాం. 24 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. 300 పైచిలుకు పారిశ్రామికవాడలను ఏర్పాటుచేశాం' అని వివరించారు.

### తెలంగాణ యాస నేడు స్టైల్‌గా మారింది

తెలంగాణ యాసకు నేడు అత్యంత ఆదరణ లభిస్తున్నదని, ఒకనాడు జోకర్లు, విలన్లు మాత్రమే మాట్లాడే తెలంగాణ భాషను నేడు బాలకృష్ణ కూడా మాట్లాడుతున్నారని కేటీఆర్ చెప్పారు. మహేశ్‌బాబు, రామ్‌చరణ్, ఎన్టీఆర్ అయినా.. అందరూ మన భాషలో మాట్లాడుతున్నారని అన్నారు. నేడు ఏ సినిమాలోనైనా తెలంగాణ పాట లేకుండా లేని పరిస్థితి వచ్చిందని, రేడియో జాకీలు తెలంగాణ యాసలో మాట్లాడడం స్టైల్‌గా మారిందని వివరించారు. ఇది తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనమని అన్నారు. నేడు విదేశాల్లో బతుకమ్మ ఆడుతున్నారని, రాహుల్ ఆడారని తెలిపారు.

### కేంద్రం సహకరించకున్నా సమగ్రాభివృద్ధి

'కేంద్రంలో తెలంగాణను శత్రువులా చూసే ఓ దుర్మార్గమైన, అరాచక ప్రభుత్వం ఉన్నది. తమకు అప్పు ఇచ్చే ఏజెన్సీల చేతులు కట్టేసి అప్పులు పుట్టకుండా చేసింది. నీళ్లలోనూ వాటా తేల్చలేదు. ఇన్ని రకాలుగా అడ్డంకులు సృష్టించినా అనేక ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నాం. మేం పనిచేసింది ఆరున్నరేండ్లే. మధ్యలో కొవిడ్‌తో ఎంతో నష్టం జరిగినా, గొప్పగా పాలన సాగించాం' అని కేటీఆర్ వివరించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని తరచూ ప్రధాని చెప్తారని, అది డైలాగులతో, జుమ్లాలతో రెట్టింపు కాదని చురక అంటించారు. దేశ ప్రజలు ఒక్కొక్కరిపై మోదీ 5 లక్షల అప్పు భారాన్ని మోపారని మండిపడ్డారు. అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేశామని, వచ్చే ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని పేర్కొన్నారు.

| నాడు | నేడు |
|---|---|
| తెలంగాణకు ముందు నెర్రెలు వారిన నేలలు, నెత్తురు బారిన నేలలు | ప్రతి ఇంటికి నల్లా నీరు ఉన్నది. 37 వేలతో భగీరథ నీరు అందించాం |
| చెరువులు తాంబాలాల్లా ఉండేవి | చెరువులు గంగాళాలుగా మారాయి |
| 131 లక్షల ఎకరాల్లో పంటలు సాగైతే 68 లక్షల టన్నుల వరి పండేది | 268 లక్షల ఎకరాల్లో 3.5 కోట్ల టన్నులు ధాన్యం పండుతున్నది. |
| ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం 13-14 స్థానాల్లో ఉండేది | నేడు పంజాబ్, హర్యానాను దాటి అన్నపూర్ణగా ఎదిగింది. |
| పది జిల్లాల్లో 9 వెనుకబడ్డవే. | 33 జిల్లాలు తలసరి ఆదాయంలో జాతీయ సగటుకన్నా అధికం |
| సాగునీటిపై 58 ఏండ్లలో రూ.38 వేల కోట్లే ఖర్చు చేశారు | మేం తొమ్మిదేండ్లలోనే రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశాం |
| 58 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో 2 మెడికల్ కాలేజీలే ఏర్పాటయ్యాయి | తెలంగాణ వచ్చాక 34 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశాం |

### తెలంగాణ రికార్డులు ఇవే..

- తలసరి ఆదాయంలో దేశంలోనే నం.1
- ఇంటికీ నీళ్లందించిన మొదటి రాష్ట్రం
- ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని రికార్డు స్థాయిలో పూర్తిచేసిన రాష్ట్రం తెలంగాణ
- గ్రామీణాభివృద్ధిలో దేశానికి ఆదర్శం- 100% ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలు
- వరి ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానం
- ఐటీ ఉద్యోగాల కల్పనలో అగ్రస్థానం
- మున్సిపల్ అవార్డుల్లో రెండో రాష్ట్రం
- 7.7% పచ్చదనం పెంపుతో ఫస్ట్
- దేశ జీడీపీలో అత్యధిక సహకారం అందిస్తున్న నాలుగు రాష్ట్రాల్లో ఒకటి
- అత్యుత్తమ పారిశ్రామిక విధాన రాష్ట్రం.
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానం
- దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్ ఉన్న రాష్ట్రం (కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్)
- ప్రపంచ వ్యాక్సిన్ రాజధాని
- తలసరి విద్యుత్తు వినియోగ వృద్ధిలో ఫస్ట్
- సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తిలో రెండో స్థానం
- దేశంలోనే అప్పులు - జీఎస్డీపీ నిష్పత్తి అతి తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఒకటి
- దేశంలో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా మెర్సెస్ సంస్థ ద్వారా వరుసగా ఐదు సార్లు ఎంపికైన హైదరాబాద్
- అతితక్కువ అవినీతి కలిగిన రాష్ట్రం
- అంతర్జాతీయ అవార్డులు, రివార్డులు, ప్రశంసలు అందుకున్న రాష్ట్రం